


# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

మిత్రుడిని సాగనంపి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వస్తున్నట్టుగా వచ్చాడు డా. రాజేష్.

" డాక్టర్, ఇలా జరిగిందేమిటి మా స్వప్ని తల్లికి?" అంటూ ఆందోళన, ఆత్రుత నిండిన గొంతుతో అడిగింది రోహిణి ఆయనకు ఎదురు వెళ్తూ.

ఆమె తడికళ్ళనిండా అంతులేని దిగులు.

" అన్ని జవాబులూ మనకి తెలిస్తే ఎంత బావుండును రోహిణి గారూ. ఇలాంటి ప్రశ్నలే ఉండవు" అన్నాడాయన ఏం చెప్పాలో తెలియనట్లుగా.

ఆ తర్వాత కిరణ్ దగ్గరగా వచ్చి, అతని భుజం మీద చెయ్యి వేసి

" ధైర్యంగా ఉందాం కిరణ్, స్వప్ని కేమీ కాదు. త్వరలోనే కోలుకుంటుంది. రాధిక కాస్త తేరుకున్నాకా మీరింటికి వెళ్ళండి. సుజిత్ మళ్ళీ రెండురోజుల్లో వస్తానన్నాడు. అప్పుడు ట్రీట్మెంట్ విషయాలు, ముందు మనం ఏం చెయ్యాలి? లాంటి విషయాలు మాట్లాడదాం అన్నాడు" అంటూ చెప్పాడు.

మరో అరగంటకి రాధిక కాస్త నెమ్మదించింది.

తనను తాను సంభాళించుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్న తన స్నేహితురాలివైపు జాలిగా చూసింది రోహిణి.

" లేచావా రాధీ, పద ఇంటికి వెళదాం" అంటూ చెయ్యి పట్టుకుంది.

" రాధికా, నువ్వూ ఆటోలో ఇంటికి వెళ్ళిపోండి రోహిణీ! నేను కిరణ్ వాడి స్కూటర్ మీద వస్తాము" అంటూ ఆటో పిలిచి ఆడవాళ్ళిద్దరినీ ఎక్కించి, 'జాగ్రత్త' అన్నాడు శేఖర్.

తర్వాత కిరణ్ భుజం మీద చెయ్యి వేసి నడిపించుకుంటూ వచ్చి స్కూటర్ మీద తన వెనక కూర్చోబెట్టుకున్నాడు. మరో పావుగంటలో ఇంటికి చేరారు నలుగురూ.

స్వప్నిక టీవీలో ఏదో కార్టూన్ చూస్తోంది, సాహిల్ తన బిల్డింగ్ బ్లాక్ సెట్ తో ఆడుతున్నాడు. ఇద్దరూ కూడా అమ్మానన్నలని పరికించి చూడలేదు.

“హాయ్ అమ్మా, నాన్న అందరూ ఒకేసారి ఎక్కడకి వెళ్ళిపోయారు?”అంది స్వప్నిక ఒక సారి తల తిప్పి చూసి చిరునవ్వుతో.

" అవును కదా, ఈరోజు శలవు కనక సరిపోయింది. లేకపోతే స్కూల్ నించి వచ్చి తాళం లేకపోతే ఇంట్లోకి ఎలా రావడం? అయినా  ఎంత లేట్ అయిందమ్మా మీరు వచ్చేసరికి!

“అక్కేమో హాయిగా టీవీ చూస్తోంది, నాకేమో ఆకలి, ఆకలి" అంటూ పొట్ట పట్టుకుని అభినయించాడు సాహిల్. ,

“ త్వరగా ఏదైనా పెట్టమ్మా”, అంటూ కిచెన్ వైపు పరిగెడుతున్న సాహిల్ వైపే చూస్తూ, గొంతు పెంచి చిలిపిగా చెప్తున్నట్టుగా

" మా ఇంట్లో అలూ పరాఠాలు ఉన్నాయి, ఎవరికి కావాలంటే వారికి వేడిచే సి, బోల్డంత బటర్ వేసి ఇస్తాను. తోడుగా గడ్డపెరుగు కూడా. ఎవరికి కావాలంటే వాళ్ళు నాతో పాటే రావచ్చు. నాతో వస్తేనే ఇస్తాను" అంది రోహిణి.

" దా అత్తా, ఇంకా ఇక్కడే నించున్నావేం?" అంటూ ఆమెని నిలదీశాడు సాహిల్ పరాఠా అన్న మాట వినగానే.

“స్వప్నీ! నువ్వూ రా మరి!” అంటూ ఆమెని లేవదీసి, 'త్వరగా!'  అంటూ వాడి చెయ్యి పట్టుకుని నడుస్తూ ' మళ్ళీ వస్తాను'   అన్నట్టు కళ్ళతోనే సైగ చేసింది రాధికకి.

పిల్లలకి పరాఠాలు పెట్టడానికి మాత్రమే కాదు, తల్లితండ్రుల దు:ఖం, ఆందోళనా వాళ్ళిద్దరికీ తెలియకూడదనే అలా తీసుకువెళ్ళిందని పెద్దలు ముగ్గురికీ తెలుసు.

" అత్తా, మరి నాకు చాలా ఎక్కువ బటర్ వెయ్యాలి సరేనా, అక్క కంటే ఎక్కువ!" అంటూ సాహిల్ కబుర్లు చెప్తూ ఉండగా నలుగురూ వెళ్ళారు.

'వీళ్ళిద్దరూ  మన ఇద్దరి ఇళ్ళకీ పిల్లలే!'  అంటుంది రోహిణి .

ఏ ఊరెళ్ళినా 'ఇది స్వప్నికి బావుంటుందీ అని ఒక గౌనో, క్లిప్పులో, చెప్పులో ఏవో ఒకటి తెస్తుంది.

సాహిల్ కైతే  తగని గారాబం వాళ్ళిద్దరి దగ్గరా. అన్నీ అడిగి మరీ చేయించుకుంటాడు.

ఎప్పుడైనా రాధికో, కిరణో అడ్డు చెప్పబోతే శేఖర్, రోహిణి ఇద్దరూ పెద్ద పోట్లాటకి వస్తారు వాళ్ళ మీదకి.

'వాళ్ళిద్దరికీ మాఇద్దరినీ ఏది కావాలన్నా అడిగే చనువు, అధికారం ఉన్నాయి, మీరు మధ్యలో అడ్డు చెప్పద్దు ' అంటారు.

రోజూ వండే చారూ, కూరా కాక, ప్రత్యేకంగా ఏది చేసినా ముందు పిల్లలకే. అది కాక తరచూ ఐస్ క్రీములూ, కేక్ లూ ఇలాంటివాటిగురించి చెప్పక్కర్లేదు.

గలగలలాడుతూ వాళ్ళు నలుగురూ వెళ్ళాకా నలుదెసలా పరుచుకున్న నిశ్శబ్దం.

కిరణ్ రాధిక ఒంటరిగా మిగిలారు ఇంట్లో.

నవనాడులూ కృంగిపోయినట్టు సోఫాలో కూలబడ్డాడు కిరణ్.

అతని దగ్గరగా వచ్చి, అతని ఒళ్ళో తల పెట్టుకుని, నేల మీద కూర్చుండిపోయింది రాధిక.

ఆమె తల మీద అతని చెయ్యి..

చిన్నపిల్లలా వెక్కి వెక్కి ఏడ్వసాగింది. కట్ట తెచుకున్న ప్రవాహంలా సాగుతోంది ఆమె దు:ఖపు ఉధృతి.

అతని పరిస్థితి అంతకన్నా భిన్నంగా లేదు.

చప్పున కిందకు వంగి,  ఆమెను నెమ్మదిగా లేపి సోఫాలో కూర్చోబెట్టి,  ముఖమంతా చెదిరిన ముంగురులు సవరించి ముఖం తుడిచాడు తన చేతిరుమాలుతో.

అధాటున అతని హత్తుకుని మెడవంపులో తల దాచుకుంది రాధిక.ఆమెని దగ్గరగా పొదువుకుని వెన్నుమీద రాస్తూ, కన్నీళ్ళు తుడిచాడు.

కానైతే తన కన్నీళ్ళనేం చెయ్యాలో తెలియలేదు అతనికి.

'ఏం జరిగింది? ఎలా జరిగింది? ఎందుకు? అనే ప్రశ్నలతో మొదలైన ఇద్దరి ఆలోచనలు .

'తర్వాత ఏమిటి? ఎలా' దాకా సాగుతున్నాయి.

ఎంత సేపున్నారో తెలియనట్టు కూర్చుండిపోయారు అక్కడే.

కడుపునిండా కావలసినన్ని పరాతాలు తిని పిల్లలిద్దరూ నవ్వుకుంటూ, సందడి చేసుకుంటూ రావడాన్ని గమనించిన రాధిక పిల్లల ముందు బయటపడకూడని

'ముఖం కడుక్కుని వస్తా ను' అని నెమ్మదిగా కిరణ్ తో చెప్పి బాత్ రూం లోకి వెళ్ళింది.

సోఫామీద పక్కన టీ.వీ రిమోట్ తో కిరణ్ ఒక్కడే మిగిలాడు.

ఎదురుగా టీవీలో 'అలాడీన్ కార్టూన్ వస్తోంది. గబ గబా కదులుతున్న బొమ్మలు.

" ఒహో, అలాడీన్ కార్టూన్ వస్తోందా , నాఫేవరెట్ కదా నాన్నా. ఫేవరెట్ ఎవరో తెలుసుగా? అలాడీన్ కాదు, జీనీ.

ఏది కావాలంటే అది నిమిషం లో పట్టుకుని వచ్చేస్తాడు కదా, అందుకే.

ఇప్పుడు నాకు ఆకలి వేసిందా? రోహిణి అత్త కూడా అచ్చంగా జీనీ లాగే నాకిష్టమైన పరాతాలు పెట్టిందిగా. ఎంత బావున్నాయో! జీనీ మన దగ్గర ఉంటే ఎప్పుడు ఏం కావాలంటే అది తెచ్చేస్తాడు, ఏది కావాలన్నా చేసేస్తాడు కద? నాన్నా!" అంటూ నవ్వాడు సాహిల్.

'నిజమే రా కన్నా, మనకీ ఓ మయా లాంతరు, కోరిన కోర్కెలు తీర్చే ఓ జీనీ ఉంటే ఎంత బావుండును. మీ అక్క, నా బంగారు తల్లి బాధ చిటికెలో తీర్చేద్దుడు కదా. మా జీవితాల్లోకి మెరుపుతీగలా వచ్చిన ఆ చిన్నారి దేవతని ఎవరు కాపాడతారు. ఆ దీపం లాంటిదేదైనా మనకి దొరుకుతుందా?' అతని మనసు బాధ్తో మూల్గింది.

" ఏం మాట్లాడవేం నాన్నా? భలే బావుంటుంది కదా!" అన్నాడు సాహిల్ తండ్రి మౌనంగా ఉండడాన్ని చూసి.

" వీడెప్పుడూ ఇంతే కదా నాన్నా, అన్నీ ఫ్రీగా, తేలిగ్గా వచ్చేయ్యాలి. బాడ్" అంది స్వప్నిక తమ్ముడిని మందలిస్తూ.

" అవున్లే, నీకు వద్దు పాపం, మరి పరాతాలు ఎందుకు తిన్నావ్?" అక్కని వెక్కిరించాడు సాహిల్.

" దానికీ, దీనికీ లింక్ ఏముంది? అత్త పెడితే తినడమూ, అన్నీ ఊరికే వచ్చేయ్యలని కోరుకోవడమూ ఒకటేనా?" అంది తమ్ముడితో వాదులాటకు దిగుతూ.

" బావుంటుంది నాన్నా లాంప్ ఉంటే, కేవలం సరదాకి మాత్రమే. లేదంటే అక్క చెప్పింది నిజం. మనకేది కావాలన్నా, కష్టపడి సాధించుకోవాలి. కానీ ఫ్రీగా రావాలి అనుకోకూడదు. కొన్ని విషయాకి మాత్రం మినహాయింపు ఉండాలి". ఆఖరు వాక్యం మనసులో అనుకున్నాడు.

వడలి పోయినట్టున్న తండ్రి ముఖాన్ని, దిగులుగా ఉన్న అతని కళ్ళనీ అప్పుడు చూసింది స్వప్నిక.

" ఏమయింది నాన్నా, ఆర్ యూ ఓ కే? ఎప్పుడూ లేనిది ఇవ్వాళ చాలా డల్ గా ఉన్నారు. అమ్మ ఏది?" అని అడిగింది తండ్రి నుదిటి మీద చెయ్యి వేసి జ్వరమా? అంది.

" అబ్బే, ఏమీ లేదు కన్నమ్మా, కొద్దిగా పని ఎక్కువయ్యింది. మీ అమ్మా, రోహిణి అత్తా సినిమాకి వెళ్ళారుట అనుకోకుండా. వాళ్ళిద్దరినీ ఎండలో తీసుకు వచ్చేసరికి కాస్త అలసట" పొంతన లేకుండా ఏదో చెప్పాడు.

ముఖం కడుక్కుని, జుట్టు దువ్వుకుని, బట్టలు మార్చుకుని కాస్త తేలికపడిన ముఖం తో వచ్చింది రాధిక.

" అవును, బైట బాగా ఎండగా ఉంది, మేట్నీ సినిమా అయ్యేసరికి నాకు కూడా విపరీతమైన తలనొప్పి. మీరు కూడా వెళ్ళి ఫ్రెష్ అయి రండి" అంది అతనితో.

" అవునా, అయితే ఉండండి. మీ ఇద్దరికీ టీ పెడతాను నేను" అంది స్వప్నిక ఉత్సాహంగా.

" వద్దులే నాన్నా, మీరిద్దరూ అమ్మతో కబుర్లు చెప్పండి, అడిగావు కదా ఇప్పుడే. నేను పెడతాను టీ" అంటూ లేచాడు.

ఇంకాసేపు అక్కడే ఉంటే తన బాధని దాచుకోలేక తానేం చేస్తాడో తెలియదనిపించింది.

ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ వంటగదిలోకి వెళ్ళాడు కిరణ్.

పిల్లలిద్దరూ టీ.వీ చూడడంలో బిజీ అయ్యారు.

" నానా, నాకు తెలుసు నువ్వు పాలు కలిపే ప్రోగ్రాం పెడతావని. నాపొట్ట పరాతాలతో నిండిపోయింది, నాకేం వద్దు. అక్కకి మాత్రమే ఇవ్వు" అని అరిచాడు సాహిల్.

" పాలు నన్ను తాగమంటావ్, పరాతాలు మాత్రం నా దగ్గరనించి లాక్కుంటావ్" అంది స్వప్నిక కోపంగా.

" జవరం వస్తున్నది నీకు, బలంగా ఉంటే జ్వరం రాదు. పాలు తాగితే బలం, తెలిసింది కదా" నాలిక బయట పెట్టి వెక్కిరిస్తూ, నా బలం చూడమన్నట్టు భుజం చూపించాడు.

" గొప్పేలే, " అంది స్వప్నిక.

మరుగుతున్న టీ వైపే చూస్తున్నాడు కిరణ్. పొంగుతున్న టీలాగే అతని మనసులో పొంగుతున్న రక రకాల ఆలోచనలు, ఒక వరసా వావీ లేకుండా అంతూ దరీ దరిలేకుండా గజిబిజిగా కదులుతున్నవి.

ఎక్కడ మొదలో, ఎక్కడ మిగులో తెలియకుండా.

ఇద్దరు డాక్టర్లతో మాట్లాడిన విషయాలతో అతనికి తగినంత సమాచారం దొరికింది.

పాపకు వచ్చిన వ్యాధి, దానికి ఉన్న చికిత్సా మార్గాలు, ఎంత అవుతుందో ప్రస్తుతం తెలియకపోయినా ట్రీట్మెంట్లు ఖచ్చితంగా ఖరీదైనవే అన్న విషయం. ఇవన్నీ అతని అవగాహనలోకి వచ్చాయి.

కనీసం తల మీద కొక గూడు ఏర్పాటు చేసుకోలేని తన మీద తనకే మొదటిసారిగా పట్టరానంత కోపం వచ్చింది. ఊర్లో ఉన్న కాస్త పొలం తప్పమరేమీ లేదు.

ఇవన్నీ అతని కళ్ళముందు కదలాడుతూ ఉంటే, వాటన్నింటినీ తల్చుకుంటే అతనికి సహజంగానే భయం వేసింది.

అవన్నీ తను తట్టుకోగలిగే విషయాలు కావు. ముఖ్యంగా ట్రీట్మెంట్ కి కావలసిన డబ్బు.

కానీ అంతకంటే, అన్నింటికంటే భయం వేసిన విషయం.

కూతురికి కలగబోయే నొప్పి. 'ఈ చికిత్సల పేరు చెప్పి ఎంత బాధకి గురి అవుతుందో?' అనుకుంటేనే అతని మనసు విలవిలలాడింది.

ఒక్క దెబ్బతో పూర్తిగా తగ్గించక్కర్లేదు. ఆ మాయాలాంతరు లోని భూతం కనీసం ఆ నొప్పిని,బాధని తను కూతురి బదులు తను అనుభవించేలా చేసినా చాలు. ఇంత చిన్న వరం కూడా దొరకదా? అనుకోగానే వచ్చింది అతనికి ఆపుకోలేని దు:ఖం..

గిన్నెలో టీ పొంగి పొరలి గాస్ అంతా ఒలికిపోయింది. అతని గుండె నిండి పొంగుకొచ్చిన గుబుల్లాగే.

ఆపుకోలేని ఆవేదనతో ఒక్క వెర్రి కేక పెట్టాడు.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments